క్లుప్తంగా

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించాలని డీఈఓ మాణిక్యంనాయుడు సూచించారు. పెంట గ్రామంలోని ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, విద్యాబోధన మధ్యాహ్నభోజన పథకం నిర్వహణను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను అభినందించారు. అలాగే విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేశారు. డీఈఓ వెంట ఎంఈఓ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కోటిపల్లిలో నేత్ర వైద్య శిబిరం



వృద్ధులకు నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ జాక్సన్

బాడంగి: జిల్లా అంధత్వ నివారణసంస్థ సౌజన్యంతో స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో మండలంలోని కోటిపల్లి వెల్ నెస్‌కేంద్రంలో మంగళవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండే షన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ జాక్సన్ 91 మందికి నేత్రపరీక్షలు చేసి 53 మందిని శస్త్ర చికిత్సల కు ఎంపిక చేశారు.శిబిరం సమన్వయకర్త సీహెచ్.వెంకటరమణ మాట్లాడుతూ శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన వారిని బస్సులో శంకర్ ఫౌండేషన్‌కంటి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్ చేసి వసతి, భోజన సౌకర్యం కల్పించి తిరిగి ఇళ్లకు చేరుస్తామన్నారు. వాడాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్ఓ జోగినాయు డు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

వంగర: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా సేవలందించాలని, విధు ల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి అన్నారు. మడ్డువలస సచివాలయంలో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డుల ను పరిశీలించారు. ఈ–సర్వీసులు పెంచాలని, సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని బోర్లను పరిశీలించి, తాగునీటి పరీక్షలు చేయించారు. ఎంపీడీఓ వెంట ఈఓపీఆర్డీ కెల్ల రామారావు, పంచాయతీ కార్యదర్శి గణేష్ తదితరులున్నారు.

ఏనుగులను కవ్విస్తే ప్రమాదం



కొండచాకరాపల్లి గ్రామస్తులకు జాగ్రత్తలు సూచిస్తున్న డీఎఫ్ఓ కొండలరావు

వంగర: ఏనుగుల గుంపును కవ్విస్తే పెను ప్రమాదం చోటుచేసుకుంటుందని జిల్లా అటవీ శాఖ అధికారి(డీఎఫ్ఓ) ఆర్.కొండలరావు అన్నారు. మండలంలోని కొండచాకరాపల్లిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏనుగుల గుంపును కొంత మంది కవ్విస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గుంపు ఒక నెల, మూడు నెలల వయస్సున్న ఏనుగుల పిల్లలు ఉన్నాయని, వాటిని బెదిరిస్తే ప్రజలపై దాడి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏనుగుల జోలికి వెళ్లొద్దని ప్రజలకు సూచించారు. ఆయన వెంట ఫారెస్ట్ రేంజ్ బొత్స అప్పలరాజు, అటవీశాఖ సిబ్బంది, ఎలీఫెంట్ ట్రేకర్స్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: కంచరాం ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను హెచ్ఎం వి.వి.వసంతకుమార్ ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.ఎక్కడ పనిచేసినా అంకిత భావంతో పని చేసి విద్యార్థుల ఉన్నతికి తోడ్పడాలని వారికి హెచ్ఎం సూచించారు. ఉపాధ్యాయులు మజ్జి మదన్‌మోహన్, వై.గౌరినాయుడు, బి.మగేష్, పి.వేణుగోపాల్, ఎల్.శ్రీనివాసరావు, వై.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల హృదయాల్లో చెరగని ముద్ర వైఎస్సార్

- ఘనంగా వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి



బొబ్బిలి: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, నాయకులు

పేద ప్రజల హృదయాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చెరగని ముద్రవేసుకున్నారని, మరో వందేళ్లు గడిచినా జన హృదయ నేతగా జనం గుండెల్లో ఉంటారని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త శంబంగి వెంకట చినఅప్పల నాయుడు, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులు, ఆశ్రమాల్లో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బొబ్బిలి పట్టణంలోని బలిజిపేట రోడ్డు జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, నాయకులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. రాజాంలోని మాధవబజార్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి రాజేష్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రాల్లో, గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: బొద్దాంలో కేక్ కట్ చేస్తున్న వైస్ ఎంపీపీ వర్షిణి, సర్పంచ్ శ్రీనివాసరావు



రాజాం : వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డాక్టర్ తలే రాజేష్, నాయకులు



రాజాం: మారేడుబాకలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్, తదితరులు



సంతకవిటి: గోళ్లవలసలో సర్పంచ్ దాలినాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, తదితరులు



బొబ్బిలి: సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న శంబంగి వేణుగోపాలనాయుడు, రమేష్‌నాయుడు, తదితరులు



రామభద్రపురం: రామభద్రపురంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి



రాజాం: మారేడుబాకలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్, తదితరులు



రాజాం: కొండంపేట వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న తలే రాజేష్, తదితరులు



రాజాం: రాజాంలోని అమ్మవారికాలనీలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వంగర: వంగర బస్టాండ్ ఆవరణలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, సుదర్శనరావు



వంగర: వి.వి.ఆర్.పేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు గంగారావు



బాడంగి: బాడంగిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శివప్రసాద్, నాయకులు



బాడంగి: కోడూరులో వైఎస్సార్ విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న మధుసూదనరావు, గ్రామస్తులు



బాడంగి: బాడంగి సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



రామభద్రపురం: ఆరికతోటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు భీమయ్య, శేఖర్



వంగర: వంగరలో మహిళలకు స్వీట్లు పంచుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు భగవతి



తెర్లాం: తెర్లాంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు బాబ్జీరావు,తదితరులు



మెంటాడ: పిట్టాడలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు,తదితరులు



బాడంగి: హరిజనపాల్తేరులో నివాళులర్పిస్తున్న నాయకులు కొండలరావు, గ్రామస్తులు



తెర్లాం: కాగాంలో నివాళులర్పిస్తున్న రామారావు,తదితరులు

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు

రామభద్రపురం: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తక్షణం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జి రాంబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు జమచేయకపోవడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించేందుకు సైతం సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిధులు లేకపోవడంతో శిథిల డ్రైనేజీలకు మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామన్నారు.వీధి లైట్ల నిర్వహణకు, కొనుగోలుకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పల్లెల అభివృద్ధి బాధ్యత నాదని చెప్పిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ జాడ లేకుండా పోయిందని, 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పడుతున్నా ఆయన అడగలేని స్థితిలో ఉన్నారని అన్నారు పాతరేగ,మామిడివలస గ్రామాల సర్పంచ్‌ల ప్రతినిధులు గొట్టాపు పైడిపునాయుడు, మూడడ్ల సోమేశ్ పాల్గొన్నారు.

పెట్రోలియం పైపులైన్‌పై అభ్యంతరాలుంటే చెప్పండి

బొబ్బిలిరూరల్: విశాఖపట్నం నుంచి రాయపూర్ వరకు హెచ్‌పీసీఎల్ ఏర్పాటు చేయనున్న పైపులైనుకు సంబంధించి భూములు ఇచ్చేందుకు రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్ కోరారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బహి రంగ విచారణ చేపట్టారు. రాముడువలస గ్రామ రైతు లక్ష్మణరావు వ్యక్తం చేసిన పలు సందేహాలను,అనుమానాలను నివృత్తి చేసి భూమి ఇచ్చేందు కు ఆయన నుంచి నిరభ్యంతర పత్రాన్ని తీసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ సంస్థ విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం,పార్వతీపురం మీదుగా రాయపూర్ వరకు దాదాపు 164 కిలోమీటర్ల మేర పెట్రోలియం పైపులైన్ ఏర్పాటు చేస్తోందన్నారు. రైతుల నుంచి రెండుమీటర్ల వెడల్పులో అవసరమైన మేరకు భూమిని సేకరిస్తున్నామని వివరించారు. రైతులకు స్థానిక ధరలకు పదిశాతం అదనంగా నష్టపరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు.పైపులైను వెళుతున్న మార్గంలో రైతులు యథావిధిగా వ్యవసాయం చేసుకోవచ్చని,బోర్లు వేయడం, భారీ వృక్షాల పెంపకంనిషేధమని చెప్పారు. తహసీల్దార్,గిరిడ అప్పలనాయుడు, హెచ్‌పీసీసిఎల్ చీఫ్‌మేనేజర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాటలకు,చేతలకు పొంతన లేదు

బొబ్బిలి: రోడ్ల విషయంలో ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబి నాయన) మాటలకు, చేతలకు పొంతన కుదరడం లేదని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లపై చిన్న గుంతలు ఉంటే బేబినాయన కొంతమందిని వెంట తీసుకుని వెళ్లి రోడ్లు బాగాలేవని ఫొటోలు దిగి సెల్ఫీ చాలెంజ్‌లు విసిరేవారని, తాను ఎమ్మెల్యే అయితే మొత్తం రోడ్లన్నింటికీ మరమ్మతులు చేయించేస్తానని, కొత్త రోడ్లు వేస్తానని హామీలు ఇచ్చిన విషయం గుర్తు చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిపోయింది కానీ కనీసం రోడ్లపైన ఉన్న గుంతల్లో పిడికెడు బుగ్గి కూడా పోయలేదని విమర్శించారు. ఆ చిన్న గోతులు కాస్తా పెద్ద నీటి కుంటల్లా మారిపోయినా టెండర్లయ్యాయని, నిధులు మంజూరయ్యాయని, కలెక్టర్ ఇస్తారని, ప్రభుత్వం ఇస్తుందని చెప్పడం, లేకుంటే వీడియోలు విడుదల చేయడం చేస్తున్నారే తప్ప స్పష్టమైన హామీ కానీ, పనులు కానీ లేవన్నారు. ఇది బొబ్బిలి ప్రజల దౌర్భాగ్యమన్నారు. రోడ్లు బాగాలేకపోవడంతో ఇటీవల కాలంలో పారాది, పాత బొబ్బిలి వద్ద జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు అసువులు బాసారన్నారు. ప్రాణాలు పోతున్నా కనీసం గోతులు కప్పాలన్న ఆలోచన మాత్రం చేయడం లేదన్నారు. ఏదో చేస్తారని ఏడాది పాటు వేచి చూశామన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో రోడ్లు బాగు చేయించేస్తానని కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

డ్రగ్స్, గంజాయి విక్రయాలపై నిఘా



రాజాం సిటీ: పాన్‌షాపులో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణా, విక్రయాలపై పటిష్ట నిఘా ఉంచామని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు తెలిపారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ పేరుతో పట్టణంలోని పలు పాన్‌షాపుల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థలకు దగ్గర్లో 18 సంవత్సరాల లోపు వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం ఈ తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు.ఆయన వెంట టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్ర, సిబ్బంది ఉన్నారు.

బొబ్బిలిలో...

బొబ్బిలి: పట్టణంలో విద్యాసంస్థలకు సమీపంలోఉన్న పాన్ షాపులు, దుకాణాల్లో మంగళవారం సాయంత్రం డీఎస్పీ జి.భవ్యారెడ్డి, పోలీసులు తనిఖీలు చేశారు. పలు దుకాణాల్లో గుట్కాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఆయన వెంట సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్ఐ ఆర్.రమేష్‌కుమార్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస, మామిడివలస, పాడివానివలస, కోటశిర్లాం, ముచ్చర్లవలస, నాయుడువలస, ఎస్.చింతలవలస, జగనన్న కాలనీ, మర్రివలస, కొండపాలవలస గ్రామాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాయుడువలస ఫీడర్ పరిధిలోని గ్రామాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

సంతకవిటి: ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి (ఏఓ)సి.బి.యశ్వంత్‌రావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. రైతులకు ఈపాస్ మెషిన్ ద్వారా ఎరువుల విక్రయాలు చేపట్టాలని, బిల్లులు ఇవ్వాలని దుకాణాల యజమానులకు సూచించారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని చెప్పారు.

స్టాక్ రిజిస్టర్లు పక్కాగా ఉండాలి

రాజాం: ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు పక్కాగా ఉండాలని ఏఓ సీహెచ్. రఘునాథ్ అన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల స్టాక్ రిజిస్టర్, ఈ–పాస్ మిషన్లు, ఫిజికల్ బ్యాలెన్స్‌కు సరిపడేలా ఉండాలని పేర్కొన్నారు. యూరియా నిల్వలపై ఆరాతీశారు.కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఏఏలు పాల్గొన్నారు. అనంతరం మండలంతో పాటు పట్టణంలోని ఎరువుల దుకాణాల యజమానులతో సమీక్షించారు.

పంటల బీమా చేయించుకోండి

రామభద్రపురం: రైతులు పత్తి,మొక్కజొన్న, వరి పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అమర శివ సూచించారు. బూసాయవలస, కోటశిర్లాం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరినారు మడుల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పత్తి పంటలో రసం పీల్చే పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవా ల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. బీమాకు సంబంధించి వరి పంటకు ఎకరానికి రూ.200 చొప్పున ఆగస్టు 15వ తేదీలోగా, పత్తి పంటకు ఎకరానికి రూ.1923 చొప్పున ఈ నెల 15వ తేదీలోగా, మొక్కజొన్న పంటకు రూ.165 చొప్పున ఈనెల 31వ తేదీలోగా మీసేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలని చెప్పారు. వీఏఏలు పి.వెంకటరమణ, పి.రేవతి, కె.రేణుక, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఉద్యానవన పంటల సాగుపై దృష్టిసారించాలి

తెర్లాం: రైతులు ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాల పండ్ల జాతి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఎంపీడీఓ రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా జీడి, మామిడి, తదితర మొక్కలను అందజేస్తోందని చెప్పారు.ఏపీఓ సుశీల పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

బొబ్బిలిరూరల్:పంటలకు ఎరువులు, పురుగు మందులను మోతాదుకు మించి వాడొద్దని వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జిశ్యామ్‌సుందర్ రైతులకు సూచించారు. మండలంలోని కలవరాయి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మొక్క జొన్న పంటను సాగుచేస్తోన్న రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయగా వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని చెప్పారు. ఎరువుల వినియోగంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనలను పాటించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాజాం సిటీ: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వార్డు హెల్త్ సెక్రటరీలు(ఏఎన్ఎం) అప్రమత్తంగా ఉండాలని ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక యూపీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీజనల్‌గా వచ్చే మలేరియా, డయేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

నేడు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా టైర్ బంద్

సంతకవిటి: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆటో డ్రైవర్లు బుధవారం టైర్ బంద్ పాటించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కె.అసిరప్పడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటారు వాహన చట్టం– 2021, భారత న్యాయ సంహిత 106(1)(2) చట్టసవరణను, ఇతర కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్, మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ మంటపం,గాంధీ విగ్రహం వద్ద కార్మికులతో కలిసి మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా బుధవారం పట్టణంలో చేపట్టనున్న నిరసన ప్రదర్శనల్లో కార్మికులంతా పాల్గొనాలని కోరారు.

అనాథ బాలికలకు సైకిళ్ల పంపిణీ

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని డోలపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు అనాథ బాలికలకు యూనివర్సిల్ ఫ్యామిలీ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, వెంకటరావు, రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు నివాళి



బొబ్బిలి: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొబ్బిలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని స్థానిక తారక రామా కాలనీలో ఉన్న ఆయ న విగ్రహానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజాం : వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజాంలో..

రాజాం: వైఎస్సార్ జయంతిని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మాధవబజార్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఆ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ కుప్పిలి చైతన్యకుమార్, నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు మధ్యలో నిలిచిన లారీ



రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఇసుకలారీ ఇదే

రాజాం/సంతకవిటి: రాజాం నుంచి సంతకవిటి వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్.రంగారాయపురం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ మంగళవారం మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. నాలుగు చక్రాల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాక్టర్ ఇంజిన్ల సాయంతో లారీని పక్కకు నడిపి రాకపోకలను క్రమబద్ధీకరించారు. సంతకవిటి మండలం మేడమర్తి వద్ద నాగావళి నది నుంచి ఇసుకను ఇలా ప్రతిరోజు విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్టు స్థానికులు ఆరోపించారు.